
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల జిల్లా వార్తలు
3★★★
బుధవారం 26 ఫిబ్రవరి 2025



పోలింగ్ రోజు వేతనంతో కూడిన సెలవు : కలెక్టర్

సిరిసిల్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ పోలింగ్ సందర్భంగా 27న గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా వేతనంతో కూడిన సెలవు దినంగా ప్రకటించిందని కలెక్టర్, ఎన్నికల అధికారి సందీప్‌కుమార్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం అన్నీ ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు, వాణిజ్య సంస్థలు, దుకాణాలు, వ్యాపార సంస్థలలో ఉపాధ్యాయులు, పట్టభద్రులు పనిచేస్తూ ఉంటే వేతనంతో కూడిన సెలవుమంజూరు చేయాలని గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయ ఓటర్లందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు.

శివోహం..

- నేడు మహా శివరాత్రి..
- జిల్లాలో సిద్ధమైన శైవక్షేత్రాలు
- వేములవాడ రాజన్న క్షేత్రంలో ప్రారంభమైన వేడుకలు
- ఉపవాసాలు, జాగరణ, శివ నామస్మరణతో తన్మయత్వం





(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

మహాశివరాత్రి పండుగను జరుపుకోవడానికి జిల్లాలోని భక్తులు సిద్ధమయ్యారు. అర్ధరాత్రివేళను శివలింగోద్భవ కాలమని శాస్త్రం చెబుతుంది. బుధవారం మహాశివరాత్రి పర్వదిన వేడుకలకు రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా శైవ క్షేత్రాలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం వేడుకలు ప్రారంభం అయ్యాయి. దేవాలయాల వద్ద క్యూలైన్లు, చలువ పందిళ్లు వేశారు. దేవాలయాల వద్ద జాగరణ చేసే భక్తుల కోసం సాంస్కృతిక ధార్మిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. హిందూ సంస్కృతి సంప్రదాయాల్లో అన్ని పండుగలు పగలు జరుపుకుంటారు. రాత్రి సమయాల్లో జరుపుకునే ముఖ్య పండుగల్లో దీపావళి, ఆ తర్వాత శివ రాత్రి మాత్రమే. శివరాత్రి రోజున ప్రతి శివభక్తుని హృదయంలో శివనామం ప్రతిధ్వనిస్తుంది. శివరాత్రి పర్వదినాల్లో శివదీక్షాపరుల భక్తి ప్రవాహం పరవళ్లు తొక్కుతుంది. శైవ క్షేత్రంలో ఒక రోజు ఉపవాసం ఉంటే ముక్తి కలుగుతుందని చెబుతారు. శివరాత్రి జాగరణ మానవ జీవితాలను కష్టాల నుంచి పరిహారం చేసి ముక్తిదాతగా వరాలను కురిపిస్తుందనే నమ్మకం ఉండడంతోనే శివరాత్రిని అతి పవిత్రంగా జరుపుకుంటారు.

● గోగుపువ్వే శివరాత్రికి శ్రేష్ఠం..

భోళాశంకరుడికి అత్యంత ప్రీతికరమైన పర్వదినం మహాశివరాత్రి. శివ భక్తులు ఉపవాస దీక్షతో శివున్ని కొలిచే క్రమంలో తెలంగాణలో ప్రధానంగా గోగుపువ్వు లేకుండా గండదీపం ముట్టించరు. మహాశివరాత్రి రోజు పగలంతా ఉపవాసం ఉండడంతో పాటు రాత్రి వేళ శివాభిషేకాలను, పూజలు చేయడంతో పాటు జాగరణ చేస్తారు. నాలుగు రకాలైన అభిషేకాలతో శివున్ని పూజిస్తారు. మొదటి జాములో శివున్ని పాలతో అభిషేకించి, పద్మాలతో పూజ జరిపిస్తారు. రెండో జాములో పెరుగు, తులసీ దళాలతో, మూడో జాములో నెయ్యితో, మారేడు దళంతో, నాలుగో జాములో తేనెతో, పాలశపుష్పములతో పూజిస్తారు. అయితే శివున్ని పూజించే వారు సకల సౌఖ్యాలతో పుణ్య ఫలాలను పొందుతారని నమ్మకం. ఇందులో శివుడు తనను పూజించే భక్తులు సువాసన వెదజల్లని పాలశ పుష్పాలనే కోరాడని, భక్తులు శివరాత్రి పర్వదినాల్లో లభించే తొలి పుష్పాల్లో కేవలం సువాసన వెదజల్లని మోదుగుపూలు (గోగుపూలు) గుర్తించి శివునికి పూజించారని పండితులు చెబుతున్నారు. తెలంగాణలో పాలశపుష్పాలుగా గోగుపూలనే భక్తులు గండదీపం చుట్టూ ఉంచి ప్రత్యేక పూజలు జరుపుతారు.



ముస్తాబైన సిరిసిల్ల శివాలయం



● అర్ధరాత్రి దాటాక లింగోద్భవ దర్శనం..

ప్రతి శివాలయంలో శివరాత్రిని అతి పవిత్రంగా భక్తి తన్మయత్వంలో జరుపుకుంటారు. శివరాత్రి రోజు స్వామి లింగోద్భవుడై భక్తులను అనుగ్రహిస్తాడని విశ్వాసం. జిల్లాలోని వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి క్షేత్రంతో పాటు జిల్లా కేంద్రంలోని శివాలయాల్లో .. మిగతా 6లో

రాజన్నా.. వస్తున్నామయ్యా..

- శివ నామస్మరణతో మార్మోగుతున్న వేములవాడ రాజన్న క్షేత్రం
- అంగరంగ వైభవంగా మహాశివరాత్రి వేడుకలు ప్రారంభం - భారీగా తరలివస్తున్న భక్తులు..
- 4 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా - 1500 మందితో భారీ బందోబస్తు
- స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్



విద్యుత్ దీపాలతో కాంతులీనుతున్న రాజన్న ఆలయం, గుడి చెరువు, శివార్చన వేదిక(ఏరియల్ వ్యూ)

వేములవాడ రాజన్న క్షేత్రంలో మహాశివరాత్రి వేడుకలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా భక్తులు వేములవాడ శ్రీరాజరాజేశ్వర దేవస్థానానికి తరలివస్తున్నారు. మూడు రోజుల పాటు కొనసాగే రాజన్న జాతరకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి నాలుగు లక్షల మంది భక్తులు హాజరవుతారని అధికారుల అంచనా.. రాష్ట్ర ప్రభుత్వం తరపున బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, తిరుమల తిరుపతి దేవస్థానం తరపున అధికారులు, అర్చకులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానంతో పాటు అనుబంధ దేవాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 1500 మందితో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

4

కోటి వరాల దేవుడు రాజన్న..

- ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం - బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్
- విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి రాజన్నకు పట్టువస్త్రాల సమర్పణ

వైభవంగా మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణ

- రాజన్న భక్తులకు ఉచిత అల్పాహారం, ఉచిత బస్సులు - ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ఉచిత బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వ స్వామివారి ఆలయంలో మహాశివరాత్రి జాతరను అంగరంగా వైభవంగా నిర్వహిస్తున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. రాజన్న ఆల యంలోని గుడిచెరువు పార్కింగ్ స్థలంలో ఏర్పాటు చేసిన ఉచిత అల్పాహారాన్ని, తిప్పాపూర్ గ్రామంలోని ఆర్టీసీ బస్టాండులో భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఉచిత బస్సులను ఈవో వినోద్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ పేదల దేవుడు వేములవాడ రాజన్న ఆలయానికి జాగరణ కోసం వచ్చే భక్తులకు ఎక్కడ ఇబ్బందులు తలేత్తకుండా ప్రత్యేక ఏర్పాటు చేశామని అన్నారు. భక్తులకు శీఘ్రమైన దర్శనం కలి గేలా క్యూలైన్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. భక్తుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత అల్పాహారాన్ని వినియోగిం చుకోవాలని సూచించారు. రాజన్న భక్తులకు తిప్పాపూర్ నుంచి ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించామని, భక్తులు వినియోగించుకోవాల ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తరుపున బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సాయంత్రం ఏడు గంటలకు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారని, తదుపరి తిరుమల, తిరుపతి దేవస్థానం నుంచి పట్టు వస్త్రాలు వస్తాయన్నారు. పెద్ద ఎత్తున రాజన్న భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని రాజన్న సేవలో తరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈవో వినోద్‌రెడ్డి కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పది..

అన్ని దానాల కన్నా అన్నదానం చాలా గొప్పదని ప్రభు త్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణం లోని శ్రీరాజరాజేశ్వర ఆలయ శ్రీలక్ష్మీగణపతి వేములవాడ వాసవి సేవా సమితి, మన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు ఆలయ ప్రారంభించారు. ప్రతి మహాశివరాత్రికి ఎన్నో యేళ్లుగా రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు ఉచిత అన్నదానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం గొప్ప విషయమని అన్నారు. అన్నదాన కార్యక్రమానికి సహకరించిన దాతలు మోటూరి మధుసూదన్‌కు కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. కాగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ కార్యక్రమానికి హాజరై నిర్వాహకులను అభినందించారు.

ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన విప్..

వేములవాడ మహాశివరాత్రికి వచ్చే భక్తుల కోసం కాం గ్రెస్ నాయకుడు మహ్మద్ అక్రమ్‌పాషా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. కాంగ్రెస్ నాయకులతో కలిసి స్టాల్స్‌ను పరిశీలించారు. మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కనికరపు రాకేష్ ఉన్నారు.

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీలు



ఆలయ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీలు

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి జాతర సందర్భంగా ప్రభుత్వ యంత్రాంగం సామాన్య భక్తులకు ఇబ్బందులు కలగకుండాచర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా, ఎస్పీ అఖిల్‌మహాజన్‌లు పేర్కొన్నారు. వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆలయాధికారులు పలు సూచనలు చేశారు. క్యూలైన్‌లు, కోడె మొక్కు లైన్, ధర్మగుండం, ప్రధాన ద్వారం, ప్రసాదం తయారీ కేంద్రాన్ని, అంబేద్కర్ కూడలిని పరిశీలించారు. ఎక్కువ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్న దృష్ట్యా క్షేత్ర స్థాయిలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ శాఖ తరుపున పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేస్తున్నామని తెలిపారు. వారి వెంట ఆర్డీవో రాజేశ్వర్, ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, తహసీల్దార్ మహేష్, సీఐ వీరప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

చందుర్తి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) :మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మంగళవారం ఆర్డీవో రాజేశ్వర్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్ తహసీల్దార్ శ్రీనివాస్, సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు : కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ఈనెల 28వ తేదీవరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా కోరారు. కలెక్టరేట్‌లో మంగళవారం రిజర్వ్ బ్యాంక్ అఫ్ ఇండియా అధ్వర్యంలో రూపొందించిన ఆర్థిక అక్షరాస్యత వాల్ పోస్టర్‌లను జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆవిష్కరించారు. జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజర్ మల్లికార్జున్‌రావు, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి పీబీ శ్రీనివాస చారీ, డీపీఆర్‌వో వంగరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్నా.. వస్తున్నామయ్యా





కాంతులీనుతున్న వేములవాడ దేవస్థానం

- శివనామస్మరణతో మార్మోగుతున్న వేములవాడ రాజన్న క్షేత్రం
- మహాశివరాత్రి వేడుకలు ప్రారంభం
- భక్తులకు ఉచిత బస్సు సౌకర్యం

సిరిసిల్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న క్షేత్రంలో మహాశివరాత్రి వేడుకలు మంగళవారం ప్రారంభమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా భక్తులు వేములవాడకు తరలివస్తున్నారు. మూడు రోజుల పాటు సాగే రాజన్న జాతరకు తెలంగాణతోపాటు ఆంధ్రా, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారికి మొక్కులను తీర్చుకోనున్నారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున అధికారులు, అర్చకులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. మహాశివరాత్రి పర్వదినం బుధవారం వేములవాడ రాజన్న సన్నిధిలో జాగరణ చేయడానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. నాలుగు లక్షల మంది భక్తులు తరలివస్తారనే అంచనాతో అధికారులు ఏర్పాట్లు చేశారు.

వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో అనుబంధ దేవాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా చలువ పందిళ్లు వేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులను ఉచితంగా దేవాలయాన్ని చేర్చే విధంగా వేములవాడ తిప్పాపూర్ బస్టాండ్ నుంచి 14 బస్సులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఏర్పాట్లను నిరంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్ పర్యవేక్షిస్తున్నారు. పోలీస్ ఔట్‌పోస్టులు, కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశారు. తాత్కాలిక వైద్యశాల ఏర్పాటు చేశారు. జిల్లాస్థాయి అధికారులను నోడల్ ఆఫీసర్లుగా నియమించారు. 1,500 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. దేవాలయానికి వచ్చే భక్తులకు ఉచిత భోజనం, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. వేములవాడకు వచ్చే అన్ని దారుల్లో భారీ స్వాగత తోరణాలను ఏర్పాటు చేశారు. దేవాలయం ప్రాంగణంలో సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో శివార్చన పేరిట సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా పారిశుధ్య చర్యలను చేపట్టారు. ఇందుకోసం జోన్‌లను ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించారు.



ఆలయ ఆవరణలో పోలీస్ సిబ్బంది

ప్రత్యేక పూజలు..

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా రాజరాజేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. మంగళవారం రాత్రి 7 గంటలకు మంత్రి పొన్నం ప్రభాకర్ శ్రీస్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. రాత్రి 7.30 గంటలకు తిరుమల తిరుపతి దేవస్థానం వారి ద్వారా పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి 9 గంటలకు నిశీ పూజ అనంతరం భక్తులకు స్వామివారి లఘు దర్శనం, కోడె మొక్కులు కొనసాగిస్తారు. బుధవారం మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా లఘు దర్శనాలు, కోడె మొక్కులు నిరంతరాయంగా కొనసాగుతాయి. బుధవారం తెల్లవారుజామున 1.30 గంటల వరకు స్థానికులకు సర్వదర్శనం, 1.30 నుంచి 2.30 గంటల వరకు దాతలు, స్థానిక అధికారులకు దర్శనం, 3.30 నుంచి 3.40 వరకు ఆలయ శుద్ధి, మంగళ వాయిద్యాలు, 3.40 నుంచి 4.23 వరకు సుప్రభాతం, ఉదయం 4.30 గంటల నుంచి 6 గంటల వరకు ప్రాతఃకాల పూజ, అర్చకుల దర్శనం, అనంతరం నిరంతరాయంగా దర్శనాల ఉంటాయి. సాయంత్రం 6.08 నుంచి స్వామి వారి కల్యాణ మండపంలో మహా లింగార్చన, రాత్రి 11.30 నిమిషాలకు లింగోద్భవ కాలలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభి షేకం నిర్వహిస్తారు.

రూ.2.03 కోట్లతో ఏర్పాట్లు

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వేములవాడ రాజన్న క్షేత్రానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రూ.2.03 కోట్లతో ఏర్పాట్లు చేశారు. వాహనాల పార్కింగ్, చలువ పందిళ్లు, క్యూలైన్ల క్రమబద్ధీకరణ, రాజన్న జల ప్రసాదం, మజ్జిగ ప్యాకెట్లు, శుద్ధ జల క్యాన్లు, వాటర్ ట్యాంకర్‌లు వంటివి ఏర్పాటు చేశారు. హెల్ప్‌సెంటర్లు, ఆరోగ్య శిబిరాలను సిద్ధం చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ధర్మగుండంలో నీటిని నిరంతరం శుభ్రం చేయడంతోపాటు 137 తాత్కాలిక స్నానపు గదులు, 60 చోట్ల తాత్కాలిక మరుగుదొడ్లు సిద్ధం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వేములవాడకు వచ్చే భక్తుల కోసం హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, హన్మకొండ, కామారెడ్డి, సిద్దిపేట, మెదక్, నిజామాబాద్, జగిత్యాల మహబూబ్‌నగర్, నర్సంపేట కోరుట్ల, మెట్‌పల్లి ఆర్మూర్, నిర్మల్, మంచిర్యాల ఆదిలాబాద్ తదితర ప్రాంతాల నుంచి ప్రత్యే కంగా 850 బస్సులను నడుపుతున్నారు. భక్తులకు స్వామివారి ప్రసాదం కోసం ఐదు లక్షల లడ్డూలను సిద్ధం చేశారు. అభిషేకం లడ్డూ 100, సాధారణ లడ్డూ .20, పులిహోర 15 రూపాయల చొప్పున విక్రయిస్తున్నారు. భక్తులు రాజన్న ఆలయంలో కోడె మొక్కులు చెల్లించుకోవడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వీఐపీ బ్రేక్ దర్శనానికి 300, కోడె మొక్కుకు 200 రూపాయలు వసూలు చేయనున్నారు. భక్తులకు జాగరణ సమయంలో ప్రత్యేకంగా శివార్చన వేదికగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.





చలువ పందిళ్ల కింద సేదతీరుతున్న జాతరకు వచ్చిన భక్తులు

తరలి వస్తున్న భక్తులు

అడుగడుగునా పోలీస్ బందోబస్తు

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి క్షేత్రంలో నిర్వహించే మహాశివరాత్రికి మంగళవారం భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. బుధవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం రాత్రి 11 గంటల నుంచి 1.30 గంటల వరకు పురజనులకు దర్శనం అవకాశం కల్పించారు. 1.30 గంటల నుంచి 2.30 గంటల వరకు దాతలు, అధికారులు, మీడియా ప్రతినిధులకు దర్శనం కల్పించారు. దీంతో భక్తులు పెద్ద సంఖ్యలో రాజన్న దర్శనం కోసం క్యూలైన్ లో బారులు తీరారు.

అడుగడుగునా సోదాలు..

వేములవాడలో నిర్వహించే మహా శివరాత్రి జాతర సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా కలెక్టర్, ఎస్పీ ఆధ్వర్యంలో 1500మంది పోలీసులు సిబ్బందితో పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. రాజన్న క్షేత్రంలోకి వచ్చే ప్రతి వాహనాన్ని సోదాలు చేస్తూ పట్టణంలోకి అనుమతిస్తున్నారు. 900లకు పైగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు.

రాజన్నను దర్శించుకున్న భక్తులు..

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయానికి మంగళవారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. రాజన్న దర్శనానికి వచ్చిన భక్తులు ధర్మ గుండంలో పవిత్ర స్నానాలు ఆచరించి కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. ధర్మదర్శనం, శీఘ్ర దర్శనం, కోడె మొక్కు కూలైన్‌లో భక్తులు ఆలయం లోకి చేరుకుని శ్రీపార్వతిపర మేశ్వరులను దర్శించుకుని తరించారు. రాజన్న దర్శనం కోసం భక్తులు క్యూలైన్‌లో గంటల తరబడి నిరీక్షించారు. రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి క్యూలైన్‌లు త్వరగా కదిలేలా చర్యలు తీసుకున్నారు.





జాతరకు వేములవాడకు వస్తున్న వృద్ధులు



ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

వైభవంగా దుబ్బరాజన్న కల్యాణం

పట్టు వస్త్రాలు సమర్పించిన కలెక్టర్



శివ పార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సారంగాపూర్, ఫిబ్రవరి, 25 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం దుబ్బరాజన్న క్షేత్రంలో మంగళవారం వేదపండితులు చంద్రశేఖర్ శర్మ నేతృత్వంలో శివ పార్వతుల కల్యాణం అంగరంగా వైభవంగా నిర్వహించారు. కలెక్టర్ సత్యప్రసాద్ స్వామి వార్ల కల్యాణానికి పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం ఆలయంలో కలెక్టర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు, వేద పండితులు కలెక్టర్‌కు తీర్థ ప్రసాదాలను అందించి సత్కరించారు. ముందుగా కల్యాణ మండపంలో ఉత్సవమూర్తులను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించి వేద పండితుల మంత్రోచ్చరణలతో కల్యాణం నిర్వహించారు. కల్యాణాన్ని తిలకిం చేందుకు చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో అనూష, ఆలయ చైర్మన్, పొరండ్ల శంకరయ్య, కొల్ముల రమణ, కోండ్ర రాంచందర్‌రెడ్డి, కోల జమున శ్రీనివాస్, ఆకుల రాజిరెడ్డి, తోడేటి శేఖర్‌గౌడ్, బొడ్డుపెల్లి రాజన్న ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

భక్తుల చేయూతతో శివాలయానికి పునర్ వైభవం

రాయికల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని శివాలయం భక్తుల చేయూతతో పునర్ వైభవం పొంది మహా శివరాత్రి వేడుకలకు ముస్తాబైంది. నాలుగు దశాబ్దాల క్రితం చౌవులమద్ది శివలింగం అనే దళిత వ్యక్తి కృషితో నిర్మితమై ఆయన చేతనే పూజలు అందుకుంది. 2024లో శివలింగం శివైక్యం చెందడంతో నిత్య పూజలు ఆగిపోయి శివాలయం ఆదరణ కోల్పోయింది. దీంతో శివ భక్తులైన యువకులు మన శివాయలం పేరిట గత అక్టోబరు నెలలో వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేయడంతో పలువురు స్పందించి విరాళాలు అందించారు. వాట్సాప్ గ్రూపులో 689 మంది సభ్యులుగా ఉన్నారు. అందులో ఆలయానికి సంబంధించిన వివరాలు, ఖర్చులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తున్నారు. శివలింగం కుటుంబసభ్యులతో పాటు మన శివాలయం పేరిట అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేశారు. వాట్సాప్ గ్రూపులో ఉన్న సభ్యులంతా నెలకు రూ.100 చొప్పున క్యూఆర్ కోడ్‌తో ఉన్న అకౌంట్‌లో వేస్తే ఆలయ అకౌంట్‌లో జమ అవుతున్నాయి. వాటిని ప్రతి నెలా ఆలయ పూజారి వేతనం, నిత్య దీపారాధనకు వెచ్చిస్తున్నారు. దీంతో శివాయంలో మళ్లీ పూజలు ప్రారంభం కావడంతో భక్తుల రాక పెరిగింది.



ఉత్సవాలకు ముస్తాబైన రాయికల్ శివాలయం

కోటి వరాల దేవుడు రాజన్న..

- ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం
- బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్
- విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి రాజన్నకు పట్టువస్త్రాల సమర్పణ

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కోడెమొక్కు చెల్లించుకుంటే కోటి వరాలు ఇచ్చే దేవుడిగా వేములవాడ రాజన్న ప్రసిద్ధి కెక్కాడని, దేశంలో ఎక్కడా లేని మొక్కు వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో ఉందని బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మహాశివరాత్రి జాతరను పురస్కరించుకుని మంగళవారం రాత్రి శ్రీరాజరాజేశ్వర స్వామివారికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దంపతులతో కలిసి పొన్నం దంపతులు పట్టు వస్త్రాలను సమర్పించారు. రాజన్న ఆలయానికి విచ్చేసిన పొన్నంకు ప్రభుత్వ విప్, ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. మంగళవాయిద్యాల మధ్య పట్టువస్త్రాలను తీసుకుని ఆలయంలోకి ప్రవేశించారు.

ముందుగా శ్రీలక్ష్మీగణపతి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీరాజరాజేశ్వరస్వామి వారి అభిషేక పూజలో పాల్గొ న్నారు. అనంతరం జగజ్జనని శ్రీపార్వతి దేవి అమ్మ వారిని దర్శించుకుని తరించారు. మహా మండపంలో అర్చకులు ఆశీర్వచనం గావించి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పొన్నం మాట్లాడుతూ రాజన్న సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఎనిమిది మంత్రి మంత్రులం ఆలయానికి వచ్చామని, ఆలయాభివృద్ధికి తోటి మంత్రులతో కలిసి కృషి చేస్తున్నామని, రాజన్న ఆలయాభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. అధికారులు సమన్వ యంతో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారని, రాజన్న ఆలయానికి వచ్చే భక్తులు ఉపవాసంతో ఉంటారని, భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా త్వరగా దర్శనం అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించామ న్నారు. వచ్చే శివరాత్రి వరకు అభివృద్ధి పనులు ముందుకు సాగేలా రాజన్నను వేడుకున్నట్లు తెలిపారు.

లోకకళ్యాణం జరగాలని వేడుకున్నాను.. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రజలందరు సుభిక్షంగా ఉండాలని, లోకకళ్యాణం జరగాలని వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారిని వేడుకున్నానని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. భక్తులకు త్వరగా దర్శనం కలిగేలా పటిష్ట చర్యలు తీసుకున్నామన్నారు. అంతే కాకుండా రాజన్న ఆలయంలో రూ. 70 కోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, మరింత అభివృద్ధి జరిగే లా మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో ముందుకు సాగుతామన్నారు. వెంట ఈవో వినోద్‌రెడ్డి కనికరపు రాకేష్, సంద్రగిరి శ్రీనివాస్, నాగం కుమార్, చిలుక రమేష్ సాగరం వెంకటస్వామి, పొత్తూరి శ్రీనివాస్ ఉన్నారు.

రాజన్నకు టీటీడీ పట్టువస్త్రాలు

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారికి తిరుమల, తిరుపతి దేవస్థానం డిప్యూటీ ఈవో లోకనాథం నుంచి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం రాజన్న ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. కాగా ఆలయ అర్చకులు ఆశీర్వచనం గావించగా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. అలాగే స్వామివారి ఆలయానికి శృంగేరి పీఠం తరఫున వేదపండితులు రాధకృష్ణశర్మ పట్టువస్త్రాలు సమర్పించారు. తిరుమల, తిరుపతి, శృంగేరి సభ్యులను మంత్రి పొన్నం, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌లు ఘనంగా సన్మానించారు.



రాజన్నకు పట్టు వస్త్రాలు తీసుకువెళుతున్న మంత్రి పొన్నం, విప్ ఆది శ్రీనివాస్ దంపతులు, తిరుమల, తిరుపతి దేవస్థానం నుంచి పట్టు వస్త్రాలను తీసుకువస్తున్న డిప్యూటీ ఈవో లోకనాథం, శృంగేరి పీఠం నుంచి పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న రాధకృష్ణశర్మ

కన్నుల పండువగా మల్లికార్జునుడి శోభాయాత్ర

ఓదెల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో సోమవారం భ్రమరాంభ మల్లికార్జునస్వామి శోభాయాత్రను కన్నులపండువగా నిర్వహించారు. గ్రామంలోని పలు వీధుల గుండా ఊరేగించి మేళతాళాలతో ఒగ్గుడోలు కళాకారులు, పోతరాజుల నృత్యాలతో స్వామివారిని ఊరేగించారు. మహిళలంతా మంగళహారతులతో ఉత్సవ మూర్తులను దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈవో సదయ్య, అర్చకులు,సిబ్బంది పాల్గొన్నారు.



సూక్ష్మ కళాకారుడి ప్రతిభ

గుండు పిన్నుపై శివయ్య, నందీశ్వరుడు

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జగిత్యాల పట్టణంలోని తులసి నగర్‌కు చెందిన ప్రముఖ సూక్ష్మ కళాకారుడు గుర్రం దయాకర్ గుండు పిన్నుపై శివయ్య, నందీశ్వరుడిని తయారు చేశాడు. ఇంతకు ముందు గుండు పిన్నుపై వివిధ కళాఖండాలను రూపొందించిన దయాకర్‌ను పలువురు ప్రశంసించారు.





గుండు పిన్నుపై తయారు చేసిన శివయ్య, నందీశ్వరుడు, కళాకారుడు దయాకర్

చాక్ పీస్‌లతో శివలింగం

ఓదెల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని మడకకు చెందిన సూక్ష్మ కళాకారుడు ఆడేపు రజనీకాంత్ చాక్‌పీస్ లతో 109 శివలింగాలను రూపొందించారు. సుమారు పది గంటల పాటు శ్రమించి సూక్ష్మ కళా నైపుణ్యంతో తీర్చిదిద్దారు. సెంటిమీటర్ ఎత్తు, వెడల్పు, చాక్ పీసులపై స్కాల్పరింగ్ ఆర్ట్ ద్వారా గుండు పిన్నులతో శివలింగాలను రూపొందించినట్లు తెలిపాడు. గతంలో పెన్సిల్ గ్రాఫైట్‌పై శివలింగం, క్యారెట్, బంగాళదుంపలతో కార్వింగ్ కళా నైపుణ్యంతో శివలింగాలను తయారు చేసినట్లు రజనీకాంత్ తెలిపారు. గతంలో కూడా ఇలాంటి ఆకృతులను రూపొందించి, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఆర్‌హెచ్‌ఆర్ ప్రపంచ రికార్డులు, ఉత్తమ కళాకారుడిగా అవార్డు అందుకున్నారు.





చాక్‌పీస్‌లతో రూపొందించిన శివలింగం, కళాకారుడు రజనీకాంత్



జ్యోతిప్రజ్వలన చేసి శివార్చన వేదికను ప్రారంభిస్తున్న పొన్నం ప్రభాకర్, ఆది శ్రీనివాస్

శివార్చన వేదికను ప్రారంభించిన మంత్రి, విప్

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న ఆలయ గుడి చెరువులో ఏర్పాటు చేసిన శివార్చన వేదికను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఈవో వినోద్‌రెడ్డితో కలిసి బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. కళాకారులు ప్రదర్శించిన ఒగ్గు కళాకారుల నృత్యాలను వీక్షించారు. ఈ కార్యక్రమంలో ఈవో వినోద్‌రెడ్డి, మామిడి హరికృష్ణ, నాగం కుమార్, కనికరపు రాకేష్, సాగరం వెంకటస్వామి, సంద్రగిరి శ్రీనివాస్, తూం మధు, ఇప్పపూల అజయ్, అన్నారం శ్రీనివాస్, పొత్తూరి శ్రీనివాస్ ఉన్నారు.



కళాకారులతో మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కొండగట్టులో భక్తుల రద్దీ



ఆలయ ఆవరణలో భక్తులు

మల్యాల, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధానం మంగళవారం భక్తులతో రద్దీగా మారింది. వేలాదిగా తరలి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతా ళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, పర్యవేక్షకులు హరిహర నాథ్, సునీల్, చంద్రశేఖర్ ఇతర అధికారులు పర్యవేక్షించారు. వందలాది వాహనాలతో ఘాట్‌రోడ్డు, జేఎన్‌టీయూ మార్గం, పార్కింగ్ ప్రదేశం నిండిపోయాయి.

పట్టభద్రులు.. మీ ఓటు పదిలంగా వేయండి



చొప్పదండి. ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ సమయం దగ్గర పడుతుంది. ఎమ్మెల్యే, ఎంపీ ఓట్లకు భిన్నంగా జరిగే ఎమ్మెల్సీ పోలింగ్ బ్యాలెట్ పద్ధతిలో జరుగుతుంది. అనేక మంది కొత్తగా ఓటర్‌గా నమోదు కాగా ఓటు వేయడానికి పలు జాగ్రత్తలు పాటించాలి. ఓటు వినియోగంపై పట్టభద్రుల అవగాహన కోసం..

మీకోసం..

ఓటు ఇలా వేయాలి...

- పోలింగ్ బూత్ బయట మీ ఓటర్ క్రమసంఖ్యను చూసుకోండి.
- బూత్ లోపలికి వెళ్లే ముందు మీ పేరు చూసుకొని సంతకం చేయాలి.
- ఓటు వేయడానికి వెళ్లే సమయంలో ఎన్నికల కమిషన్ సూచించిన ఏదైనా ఐడీ కార్డును వెంట తీసుకుపోవాలి.
- పోలింగ్ కేంద్రాలలో ఇచ్చే పెన్‌ను మాత్రమే వాడాలి.
- పోలింగ్ బూత్‌లో మీకు ఇచ్చిన బ్యాలెట్ పేపర్‌లో అభ్యర్థి పేరు, ఫొటో ఉంటుంది.
- మీరు మొదటి ప్రాధాన్యత ఇచ్చే అభ్యర్థికి ఎదురుగా ఉన్న బాక్స్‌లో ఒకటి అని రాయాలి.
- ఇతర అభ్యర్థులకు కూడా మీరు నచ్చిన ప్రాధాన్యత ఓటు వేసుకోవచ్చు. 1,2,3 ఇలా నంబర్ వేసి ఓటు వేసుకోవచ్చు.

ఓటర్లు చేయకూడని పనులు

- పోలింగ్ బూత్‌లో మీ స్వంత పెన్‌ను వాడవద్దు.
- అభ్యర్థులు అందరికీ ఒకే నంబర్ ఇవ్వవద్దు.
- బ్యాలెట్ పేపర్‌లోని బాక్స్‌లో ఒకటి అని రాయవద్దు. ఇంగ్లీష్‌లో కూడా రాయవద్దు. కేవలం అంకెలు (1,2,3) అని మాత్రమే వేయాలి.
- బ్యాలెట్ పేపర్‌లో ఎక్కువ పేర్లు ఉంటాయి. మీకు నచ్చిన వారికి 1 నంబర్ వేయాలి.
- ఎన్నికల సిబ్బంది చెప్పినట్లుగానే బ్యాలెట్ పేపర్‌ను ఫోల్డ్ చేయాలి. లేని పక్షంలో ఓటు చెల్లదు.
- బ్యాలెట్‌ను ఖాళీగా వేయరాదు. ఇంక్ పెన్నుతో ప్రాధాన్యత నంబర్‌ను రుద్దవద్దు.
- అభ్యర్థి పక్కన సూచించిన బాక్స్ వద్ద కాకుండా ఇతర చోట్ల అంకెలు వేస్తే ఓటు చెల్లదు.
- బ్యాలెట్ పేపర్‌లో (1,2,3) అంకెల ప్రాధాన్యత కాకుండా ఇతర నెంబర్లు వేస్తే ఓటు చెల్లదు.

ఎమ్మెల్సీ ఫలితాలను రెఫరెండంగా భావిస్తారా..

- ఎన్నికల్లో గెలిచేది బీజేపీ అభ్యర్థులే..
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి బండి సంజయ్, పక్కన ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, కాటేపల్లి వెంకటరమణారెడ్డి, నాయకులు

కరీంనగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ 14 నెలల పాలన బాగుందని అంటున్న సీఎం ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలను రెఫరెండంగా తీసుకునేందుకు సిద్ధమా అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ప్రశ్నించారు. మంగళవారం కరీంనగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్‌కు ఎందుకు ఓటు వేయాలని ప్రశ్నించారు. కులగణనకు తాము వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. బీసీ జాబితాలో ముస్లింలను చేర్చడాన్ని మాత్రమే వ్యతిరేకిస్తున్నామన్నారు. విద్యుత్ కొనుగోళ్ల అక్రమాలపై జస్టిస్ లోకూర్ కమిషన్ నివేదిక ఇచ్చి మూడు నెలలైనా ఎందుకు బయటపెట్టలేదన్నారు.

ఫార్ములా ఈ రేసు కేసులో కేటీఆర్ వల్లే ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగమైందని సీఎం హోదాలో రేవంత్‌రెడ్డే చెప్పారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఏర్పాటు చేసిన విచారణ కమిషన్ గడువును పొడగిస్తున్నారే తప్ప కేసీఆర్‌ను ఎందుకు విచారించలేదని ప్రశ్నించారు. దమ్ముంటే సీబీఐ విచారణ కోరాలని, దోషులందరినీ అరెస్టు చేసి బొక్కలో వేస్తామన్నారు. వరి వేస్తే ఉరే అని కేసీఆర్ అంటే రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి కూడా వరి వేయొద్దు వేస్తే నష్ట పోతారని రైతులను హెచ్చరిస్తున్నారన్నారు. పొరుగు రాష్ట్రానికి నీటిని దోచి పెట్టడం వల్లే ఈ ఏడాది పుష్కలంగా వర్షాలు పడ్డా నీటి కటకట ఎందుకు వచ్చిందన్నారు. ఉద్యోగులు, నిరుద్యోగులు, ఉపాధ్యాయుల పక్షాన పోరాటం చేసేది బీజేపీ పార్టీ మాత్రమే అన్నారు. బీజేపీని ఆదరించి ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, కాటేపల్లి వెంకట రమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతలరాం చంద్రారెడ్డి, మాజీ మేయర్ సునీల్‌రావు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జె సంగప్ప పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్

దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి..



మాట్లాడుతున్న మహేష్‌కుమార్‌గౌడ్, పక్కన మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

- అడుగడుగునా బీసీలను అణచివేస్తున్న బీజేపీ
- పట్టభద్రుల ఓటర్లు విజ్ఞతతో ఆలోచించి ఓటేయాలి
- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

కరీంనగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కేంద్రమంత్రి స్థాయిలో వ్యవహరించకుండా బండి సంజయ్ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. మంగళవారం డీసీసీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బండి సంజయ్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని అన్నారు. ఫార్ములా ఈ రేసు అవినీతి పై కేటీఆర్‌పై కేసు నమోదై, విచారణ జరుగుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నోటీసులు కూడా ఇవ్వలేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ వాఖ్యలు చేయడం శోచనీయమన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో విదేశాల నుంచి నిందితులను తీసుకురావడంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న పరిమితి ఆయనకు తెలియదా అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో చేస్తున్న అభివృద్ధి పై చర్చకు సిద్ధమన్నారు.

ఏడాది కాలంలో 55 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, బీఆర్ఎస్ ప్రభుత్వాలు 10 ఏళ్లలో 50 వేల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదని విమర్శించారు. పట్టభద్రులు విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలన్నారు. సోషల్ మీడియాను అనైతికంగా అబద్ధపు ప్రచారానికి, వీడియోలను మార్ఫింగ్ చేయడానికి బీజేపీ విచ్చలవిడిగ వాడుతోందని విమర్శించారు. దీనిని ప్రజలు గమనించి అప్రమత్తంగా ఉండాలన్నారు. పట్టభద్రుల సమస్యలు పరిష్కారించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డిల పాత్ర ఏంటి? అనేది ఒక సారి ఆలోచన చేసుకోవాలన్నారు. సమగ్ర కుల గణనపై సర్వేపై బీజేపీ తన అభిప్రాయం ఏంటో చెప్పాలన్నారు. ధైర్యం ఉంటే బీసీ రిజర్వేషన్ల బిల్లును తొమ్మిదవ షెడ్యూల్‌లో చేరుస్తామని, ప్రధానిని ఒప్పించి 42 శాతం రిజర్వేషన్లకు తెస్తామని బీజేపీ నేతలు చెప్పా లన్నారు. పట్టభద్రుల ఎన్నికలు రాష్ట్ర స్థితిగతులు రాష్ట్ర అంశాలను అవగాహనతో ఓటు వేసే అంశమని, బీసీలను అణగదొక్కుతున్న బీజేపీకి ఓటేస్తారా...? బీసీలకు సర్వం చేస్తున్న కాంగ్రెస్‌కు ఓటేస్తారా పట్టభద్రులు ఆలోచించాలన్నారు. నిన్న ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లో జరిగిన సమావేశాలు విజయవంతం కావడంతో దిమ్మతిరిగి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి గెలుపును ఎవరూ ఆపలేరన్నారు.

సమావేశంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఆయిల్‌ఫెడ్ ఛైర్మన్ జంగ రాఘవరెడ్డి, నాయకులు బొమ్మ శ్రీరాంచక్రవర్తి, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, అర్బన్ బ్యాంక్ ఛైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి, ఎర్ర శ్రీనివాస్, వైద్యుల అంజన్ కుమార్, ఎండీ తాజొద్దీన్, ఆకారపు భాస్కర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్యనారాయణగౌడ్, ఆర్టీఏ సభ్యుడు పడాల రాహుల్, మాజీ కార్పొరేటర్లు చాడగొండ బుచ్చిరెడ్డి, ఆకుల ప్రకాశ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఏమి చేయగలడో చేసి చూపిస్తా

రాజకీయాలను కలుషితం చేస్తున్న రెండు పార్టీల అభ్యర్థులు

పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసన్న హరికృష్ణ

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు ఎమ్మెల్సీలుగా గెలిచిన వారెవరూ పట్టభద్రులు, ఉపాధ్యాయుల సమస్యలను పట్టించుకోలేదు.. నన్ను ఆశీర్వదించి గెలిపిస్తే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఏమి చేయగలడో చేసి చూపిస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ అన్నారు. మంగళవారం కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంవత్సర కాలంగా 42 నియోజక వర్గాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నానని తెలిపారు. డబ్బులు ఉంటేనే రాజకీయం చేయవచ్చు భావన అనే పోవాలని, బలహీన వర్గాల బిడ్డ ఎందుకు రాజకీయం చేయవద్దు అనే అంశంతో తాను ముందుకు వచ్చానన్నారు. రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థుల్లో ఒకరు పారిశ్రామిక వేత్త, ఇంకొకరు కార్పొరేట్ విద్యావేత్త అని, వీళ్లు ఎందుకు రాజకీయాలను కలుషితం చేస్తున్నారని ప్రశ్నించారు. వారు ఈ రోజు డబ్బులు పంపిణీ చేస్తున్నారని విమర్శించారు. తాను అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రజల ముందుకు వచ్చానన్నారు. తాను గెలవక పోతే డబ్బులు రాజకీయాలను ప్రభావితం చేసినట్లేనని, రాజకీయాల్లో డబ్బు ప్రామాణికం కాదన్నారు. తెలంగాణ రూపురేఖలు మారాలి అంటే తన లాంటి వాళ్ళు గెలవాలన్నారు. ఈ గుండె ఏడు నెలలుగా తిరిగి అలిసి పోయిందని, భవిష్యత్ రాజకీయాల్లో ఈ గుండెను మీరే ముందుకు తీసుకుపోవాలన్నారు. ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకుండా ఇన్ని రోజులు ప్రచారం చేసానని, రేపు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో డబ్బులు లేకుండా విద్యావంతులు సర్పంచ్‌లు కావాలి అంటే తన గెలుపు నుంచి మొదలవ్వాలన్నారు. మహిళా సాధికారత గురించి ఏ పార్టీ చర్చించలేదని, తన పేరులో సగం తన భార్యపేరు ఉందని, తనకు మహిళలంటే గౌరవం ఉందన్నారు.

'జూకంటి'కి కొలకలూరి కవితా పురస్కారం

నేడు హైదరాబాద్‌లో ప్రదానం



సిరిసిల్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కవి జూకంటి జగన్నాథం రచించిన 'ఒక కప్పు ఛాయ్- నాలుగు మేసేజ్‌లు' కవితా సంపుటి కొలకలూరి భగీరథ కవితా పురస్కారానికి ఎంపికయ్యింది. బుధ వారం సాయంత్రం హైదరాబాద్‌లో తెలుగు యూనివర్సిటీలో ఎన్‌టీఆర్ కళాప్రాంగణంలో నిర్వహించ నున్న కార్యక్రమంలో జూకంటి జగన్నాథంకు నిర్వాహకులు పురస్కారం అందించనున్నారు.

తండ్రి హత్య కేసులో కుమారుడికి జీవిత ఖైదు

సుల్తానాబాద్ ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి):తండ్రిని హత్య చేసిన కేసులో కుమారుడికి జీవిత ఖైదుతోపాటు ఐదు వేల రూపాయలు జరిమానా విధిస్తూ పెద్దపల్లి మున్సిఫ్ జడ్జ్ సెషన్ కోర్టులో మంగళవారం తీర్పు ఇచ్చారు. పూసాల గ్రామానికి చెందిన తీగల నర్సయ్య వ్యవసా యం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇతనికి భార్య భూదేవి, కొడుకు రాజేషంతో పాటు మరో కుమారుడు ఉన్నారు. జులాయిగా తిరుగుతూ ఇంటి వద్ద ఉంటున్న కొడుకు రాజేశంను ఐకేపీలో ఆరబోసిన ధాన్యం పనుల్లో సహాయం కోసం రమ్మన్నాడు. ఐకేపీ సెంటర్ వద్ద తండ్రి కొడుకుల మధ్య ఘర్షణ జరగగా ఆవేశంలో కొడుకు రాజేశం తండ్రి నర్సయ్యను నెట్టి వేయగా కింద పడిన తండ్రి తలపై రాయి వేయగా నర్సయ్య అక్కడికక్కడే మరణించాడు. ఈ సంఘటనపై తీగల భూదేవి ఫిర్యాదు మేరకు 8 డిసెంబర్ 2023లో కేసు నమోదైంది. కేసు దర్యాప్తు చేయగా మంగళ వారం పెద్దపల్లి జిల్లా కోర్టులో రాజేశంకు జీవిత కాలం కఠిన కారాగార శిక్ష, ఐదు వేల రూపాయలు జరిమానా విధించారు.

విద్యార్థిని వేధించిన వ్యక్తికి నెల రోజుల జైలు శిక్ష

సుల్తానాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పూసాల గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థిని వేధింపులకు గురి చేసిన మియాపూర్ గ్రామానికి చెందిన గోషిక కుమార్‌కు నెల రోజుల జైలుశిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ జిల్లా, సెషన్స్ జడ్జి శ్రీనివాస రావు మంగళవారం తీర్పు ఇచ్చారు. వేధింపుల సంఘటనపై 20 నవంబరు 2019న బాధితురాలి తండ్రి సుల్తానాబాద్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పెద్దపల్లి ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టులో కేసు విచారణ జరిగింది. నేరం ఋజువు కావడంతో జైలు శిక్ష, జరిమానా విధించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యవసాయ కూలీ మృతి



చంద్రయ్య (ఫైల్)

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాదాపూర్ గ్రామానికి చెందిన మెకిరాల చంద్రయ్య (71) అనే వ్యవసాయ కూలీ రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం చంద్రయ్య గ్రామ శివారులోని మామిడితోటలో కూలీగా పని చేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం సైకిల్‌పై ఇంటికి భోజనానికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో చంద్రయ్య అక్కడి కక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. చంద్రయ్య భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మృతదేహంతో ఆందోళన

మాదాపూర్ గ్రామంలో ట్రాక్టర్ యజమాని ఇంటి ఎదుట చంద్రయ్య మృతదేహంతో బంధువులు ఆందోళనకు దిగారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని చంద్రయ్య బంధువులను సముదాయించి అక్కడి నుంచి పంపించి వేశారు. చంద్రయ్య అంత్యక్రియలను నిర్వహించే వరకు పోలీసులు గ్రామంలో పికెటింగ్ నిర్వహించారు.

తండ్రి ఆస్తి కోసం కొడుకు పథకం



హుజూరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్‌జీ

- హుజూరాబాద్ చోరీని 24 గంటల్లో ఛేదించిన పోలీసులు
- కొడుకు, కోడలుతో పాటు మరో ముగ్గురు అరెస్టు, పరారీలో ఒకరు
- 70 తులాల బంగారం, రూ.1.50లక్షలు స్వాధీనం

హుజూరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తండ్రి ఆస్తిని కాజేయాలని కొడుకు, కోడలు పథకం వేశారు. హుజూరాబాద్‌లో సంచలనం సృష్టించిన భారీ దొంగతనం కేసును పోలీసులు 24 గంటల్లో ఛేదించారు. అప్పుల పాలై తండ్రిని డబ్బులు అడిగితే ఇవ్వకపోవడంతో కొడుకు, కోడలు ఆస్తి కోసమే పథకం ప్రకారం దొంగతనం చేసి దొరికిపోయారు. వీరికి సహకరించిన మరో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. ఒకరు పరారీలో ఉన్నారు. హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ మంగళవారం చోరీ వివరాలు తెలిపారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణంలోని ప్రతాపవాడకు చెందిన ప్రతాప రాఘవరెడ్డి-వినోదలకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. పెద్ద కొడుకు ప్రతాప నాగరాజు-శాలినిలు వ్యాపారం చేసి రూ. కోటి వరకు అప్పుల పాలయ్యారు. అప్పులు ఇచ్చిన వారి ఒత్తిడి ఎక్కువ కావడంతో తండ్రి వద్ద ఉన్న డబ్బులు, బంగారం దోచుకోవాలని నెల రోజుల క్రితం ప్లాన్ వేసుకున్నాడు. ఇందుకు అతని హోటల్‌లో పనిచేసే అమీర్‌ను సాయం కోరగా, అతని బంధువైన హనుమకొండ జిల్లా, స్టేషన్‌ఘణపూర్ మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన పాత నేరస్తుడు సమీర్, కరీంనగర్‌కు చెందిన మున్నా, హుస్నాబాద్ మండలం కుందువని పల్లెకు చెందిన కృష్ణలతో సుపారీ మాట్లాడుకున్నారు. పథకం ప్రకారం హోటల్‌లో దొంగతనం గురించి చర్చించుకొని ఆదివారం రాత్రి నాగరాజు, శాలిని, అమీర్‌లు పక్కనే ఉన్న వారి ఇంటిలో ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉన్నారు. అర్ధరాత్రి తర్వాత మరో ముగ్గురు కరెంట్ మోటార్ ఆన్ చేయగా నీళ్ల శబ్దం విన్న రాఘవరెడ్డి భార్య వినోద బయటకు వచ్చింది. సమీర్, మున్నా, కృష్ణలు ఇంట్లోకి చొరబడి, ఆమెను కత్తులతో గాయపరిచి కట్టేశారు. ఈ క్రమంలో రాఘవరెడ్డి, ఆయన కూతురు మానస రూమ్‌లో నుంచి బయటకు రాగానే వారిపై దాడి చేశారు. కత్తులతో బెదిరించి 70తులాల బంగారం, రూ. 5లక్షల నగదును దోచుకొని అక్కడి నుంచి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్‌ను పిలిపించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన అనంతరం కుటుంబ సభ్యులను పలు కోణాల్లో విచారించారు. కొడుకు నాగరాజుపై అనుమానం రావడంతో పోలీసులు తమదైన శైలిలో విచారించగా నేరం ఒప్పుకున్నారన్నారు. దీంతో నిందితులను పోలీసు లు అదుపులోకి తీసుకుని 70తులాల బంగారం, రూ. 1.50లక్షల నగదు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

24గంటల్లో ఛేదించిన పోలీసులు

హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ ఆధ్వర్యంలో 24గంటల్లోనే దొంగతనం కేసును సీఐ తిరుమల్‌గౌడ్, ఎస్సై యూనస్, సీసీఎస్ టీమ్ సురేందర్‌పాల్, సాయి, అవినాష్, టెక్‌టీమ్ సిబ్బంది ప్రదీప్, సంతోష్ పలు కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. పథకం ప్రకారం నాగరాజు హోటల్‌లో పనిచేసే అమీర్ వేలిముద్రలు దొరకవద్దనే ఉద్దేశ్యంతో ముందస్తుగా హుజూరాబాద్ పట్టణంలోని ఓ మెడికల్ షాపులో వారం రోజుల క్రితం గ్లౌజులు కొనుగోలు చేశాడు. అంతేకాకుండా దొంగతనంలో జరిగిన పెనుగులాటలో ఓ వ్యక్తి బ్రాస్‌లెట్ పడిపోయింది. వాటిని ఆధారంగా తీసుకున్న పోలీసులు మెడికల్ షాపునకు వెళ్లి సీసీ ఫుటేజీలను తీసుకొని విచారించగా నాగరాజు కొనుగోలు చేయమంటే గ్లౌజులు కొనుగోలు చేశానని అమీర్ చెప్పాడు. అలాగే నాగరాజు సెల్‌ఫోన్ డాటా ఆధారంగా కూపీ లాగడంతో దొంగతనం కేసు బయటపడింది. చాకచక్యంగా కేసును ఛేదించిన పోలీసులను ఏసీపీ శ్రీనివాస్‌జీ అభినందించారు.



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పోరాటం

టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి అశోక్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్‌కుమార్

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాలుగా ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడానని, తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే శాసన మండలిలో ఉపాధ్యాయుల గొంతుకనై ప్రశ్నిస్తానని కరీంనగర్, నిజామా బాద్, మెదక్, ఆదిలాబాద్ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి వై.అశోక్‌కుమార్ తెలిపారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయులు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిజాయితీతో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీగా గెలిపిస్తే సీపీఎస్ రద్దుకు కృషి చేస్తానని, కాంట్రాక్టు ఉపాధ్యాయులను రెగ్యులరైజ్ చేసేలా ప్రభుత్వంతో పోరాడుతానని హామీ ఇచ్చారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 ద్వారా వేతనాల చెల్లింపు, హెల్త్ కార్డుల జారీ, రెసిడెన్షియల్ వసతి గృహ భవనాల నిర్మాణాలు, తదితర సమస్యల పరిష్కారంలో ముందుంటానని హామీ ఇచ్చారు. టిపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నబోయిన తిరుపతి, బిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కొమ్ము రమేష్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కాంపెల్లి లక్ష్మన్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల కోసం నిరంతరం పోరాడే వ్యక్తి అశోక్‌కుమార్ గెలుపునకు సంఘాలకు అతీతంగా ఉపాధ్యాయులు ఓటేయాలని కోరారు. సమావేశంలో పోచయ్య, పర్శరాములు గౌడ్, జీవన్ రాజు, కోల రాజమల్లు, డానియల్, దేవదానం, హెచ్‌ఎం నేదునూరి కనకయ్య పాల్గొన్నారు.

టీచర్స్ ఎమ్మెల్సీగా అశోక్‌కుమార్‌ను గెలిపించండి

ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్

కరీంనగర్ టౌన్: కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ టీచర్ ఎమ్మెల్సీగా ఉద్యమ నేత అయిన వై.అశోక్‌కుమార్‌కు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలతో ఆయన సమావేశయ్యారు. 36 ఏళ్లకుపైగా ఉపాధ్యాయ ఉద్యమ అనుభవం కలిగిన తెలంగాణ ఉపాధ్యాయ ఉద్యోగుల జేఏసీ నాయకుడిగా అశోక్ కుమార్ పనిచేశారని, ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషిచేశారని అన్నారు. ఆయనను టీచర్ ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు. సమావేశంలో టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి వై అశోక్‌కుమార్, టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి తిరుపతి, కె రమేష్, అశోక్‌కుమార్‌పాల్గొన్నారు.

మల్కపేట నుంచి సాగునీటిని విడుదల చేయండి

సిరిసిల్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మల్కపేట రిజర్వాయర్ ద్వారా మిడ్ మానేరు నీటిని ఎత్తిపోసి సింగసముద్రాన్ని నింపాలని, సింగసముద్రం ఆయకట్టు రైతులకు నీటిని విడుదల చేయాలని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి బీఆర్‌ఎస్ వర్కింగ్ అధ్యక్షుడు, సిరిసిల్ల ఎమ్మెల్యే కే తారకరామారావు మంగళవారం లేఖను రాశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే మల్కపేట రిజర్వాయర్ ఎత్తిపోతల ట్రయల్‌రన్ కూడా పూర్తయిందని ఎన్నికల కోడ్ రావడంతో ప్రారంభోత్సవం చేయలేకపోయామని పేర్కొన్నారు. మిడ్ మానేరులో 17 టీఎంసీల నీరు ఉన్నందున నీటిని ఎత్తిపోసి సింగసముద్రం పరిధిలో 2వేల ఎకరాలకు సాగునీరు అందించాలని కోరారు. మల్కపేట రిజర్వాయర్ ద్వారా నీటిని ఎత్తిపోయడం ద్వారా రాచర్ల బొప్పాపూర్, రాచర్ల గొల్లపల్లి, దేవుని గుట్ట తండా, రాచర్ల తిమ్మాపూర్, బాకూరుపల్లి తండా, రాజన్నపేట, కిష్టునాయక్ తండా, అల్మాస్‌పూర్, అక్కపల్లి, బుగ్గ రాజేశ్వర తండా, నారాయణపూర్, ఎల్లారెడ్డిపేట, కోరుట్లపేట, సముద్రలింగాపూర్ రైతుల పంటలను కాపాడుకున్నవాళ్లం అవుతామని విజ్ఞప్తి చేశారు.

జిల్లా ఇన్‌చార్జి డీఈవోగా జనార్దన్‌రావు

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా ఇన్‌చార్జి డీఈవోగా కరీంనగర్ డీఈవో జనార్దన్‌రావును నియమిస్తూ స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ పి మదన్‌మోహన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా విద్యాధికారిగా పనిచేస్తున్న జగన్మోహన్‌రెడ్డి సెలవుపై వెళ్లడంతో ఆయన స్థానంలో కరీంనగర్ డీఈవోకు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించినట్లు పేర్కొన్నారు.

జాతీయ పార్టీలు బీసీలకు అవకాశం ఇవ్వలేదు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : జాతీయ పార్టీలు కాంగ్రెస్, బీజేపీ పట్టాభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో బీసీలకు అవకాశం ఇవ్వకపోవడం దురదృష్టకరమని గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బుర్ర నారాయణగౌడ్ అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల గందుల వెంకన్న, గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధికార ప్రతినిధి కందుకూ రి రామాగౌడ్, నాయకులు బాలసాని అంజయ్యగౌడ్, విక్కృతి పర్శరాములు గౌడ్, పరకాల చిన్నఅంజయ్యగౌడ్, విక్కృతి ముత్తయ్య గౌడ్, వొల్యాల జగన్ గౌడ్, తీగల మల్లేశంగౌడ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపునకు కృషి..

తంగళ్లపల్లి (సిరిసిల్ల రూరల్), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలని యువమోర్చా జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి కోరారు. తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసాని రాంలింగారెడ్డి, గజభీంకార్ సంతోష్, చిందం నరేష్, బోయరాజు, కాశీచరణ్, కసుగంటిరాజు, సిరిసిల్లవంశీ, నులుగొండ శ్రీనివాస్, సంతోష్, భాను, యాదగిరి, గోపీ, శ్రీధర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థి స్థాయి నుంచే రచనలపై దృష్టి సారించాలి

తంగళ్లపల్లి (సిరిసిల్ల రూరల్), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థిస్థాయి నుంచే రచనలపై దృష్టి సారించి చిన్నచిన్న కథలను రాయాలని నేషనల్ బుక్ ట్రస్ట్ తెలుగు సంపాదకులు, దక్షిణ భారత అఫీసర్ డాక్టర్ పత్తిపాక మోహన్ కోరారు. తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం సంచార పుస్తక ప్రదర్శను నేషనల్ బుక్ ట్రస్ట్ అధ్వర్యంలో మొబైల్ పుస్తక ఎగ్జిబిషన్‌ను ఏర్పాటుచేయగా ప్రధానోపాధ్యాయురాలు జోగినపల్లి అనురాధ ప్రారంభించారు. బాలసాహితీ వేత్తలు గరిపెల్లి అశోక్, డాక్టర్ కందేపి రాణి ప్రసాద్, డాక్టర్ వాసరవేణి పర్శరాం, బేతి దుర్గయ్యలు, ప్రోగాం ఇంచార్జ్ సుంకరి లక్ష్మారెడ్డి, మండల విద్యాధికారి భూక్యరాజునాయక్, ఉపాధ్యాయులు రాజేశ్వర్‌రావు, రమేష్, పద్మ, శైలాజ, శిరీష, సమత, సాయిప్రణీత్, నీరజ, సంతోష్ పాల్గొన్నారు.

ఆవునూర్ పాఠశాలలో విజ్ఞాన ప్రదర్శన

ముస్తాబాద్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆవునూర్ గ్రామంలోగల జిల్లా పరిషత్ పాఠశాలలో కలామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ ఎక్స్‌లెన్స్ మిషన్స్ సాటిలైట్స్ ప్రదర్శన నిర్వహించారు. హెచ్‌ఎం మద్దికుంట లక్ష్మణ్, కలామ్ ఇన్స్ట్యుట్ ప్రతినిధి ఈసరి పర్శరాములు, సాయి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అడవి పందుల వేటగాళ్లకు తీవ్ర గాయాలు

చందుర్తి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అడవి పందుల కోసం వెళ్లిన వేటగాళ్లపై పంది దాడి చేసిన సంఘటన చందుర్తి శివారు బోడగుట్ట ప్రాంతంలో మంగళవారం జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. మండలంలోని జోగాపూర్ గ్రామానికి చెందిన సంచార జీవనం సాగించే సమాజిక వర్గానికి చెందిన వారు అడవి పందుల వేటకు వెళ్లారు. అప్పటికే వారికి ఓ పంది చిక్కగా, మరో పంది కోసం వేటాడుతున్న క్రమంలో పంది దాడి చేసింది. ఓ వ్యక్తికి తీవ్రంగా, మరోవ్యక్తికి స్వల్పంగా గాయాలయ్యాయి. దాడిలో గాయపడిన వ్యక్తిని 108అంబులెన్స్‌లో వేములవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

గట్టు మల్లన్న స్వామికి పెద్ద పట్నం మొక్కులు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్‌లోని యాదవ సంఘం ఆధ్వర్యంలో గట్టు మల్లన్న ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సుందరీకరణ పనుల్లో భాగంగా పదిర గ్రామ వాసి కుంబాల సుధాకర్‌రెడ్డి తన తండ్రి జ్ఞాపకార్థం రూ.3 లక్షల వెచ్చించి గ్రానైట్ వేయించారు.

అవకతవకలు జరగకుండా చూడాలి

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోలింగ్ ఏజెంట్‌లు అవకతవకలు జరుగకుండా చూడాలని బీజేపీ ఎమ్మెల్సీ జిల్లా ఇన్‌చార్జ్ ఎన్‌వీ సుభాష్ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని అంకారపు ఫంక్షన్ హాల్‌లో మంగళవారం బీజేపీ పార్టీ ఏర్పాటుచేసిన ఎన్నికల ఏజెంట్‌లతో సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపీ ముదిరాజ్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ ఎన్నికల జిల్లా ఇంచార్జ్ ఎన్‌వీ సుభాష్ మాట్లాడారు. వేమువాడ నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ చేన్నమనేని వికాస్‌రావు, సిరిసిల్ల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఇంచార్జ్ బాస సత్యనారాయణ, వేములవాడ ఎమ్మెల్సీ ఇంచార్జ్ అంబటి బాలేష్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లిఖార్జున్, కరీంనగర్ పార్లమెంట్ కో-కన్వీనర్ అడెపు రవీందర్, సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ కారెడ్ల మల్లారెడ్డి, వేములవాడ నియోజక వర్గ కన్వీనర్ మార్తా సత్తయ్య బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రం ఏర్పాటు

సిరిసిల్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో పోలింగ్ సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మంగళవారం జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా కేంద్రాన్ని పరిశీలించారు. ఈ నెల 27న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఉన్న నేపథ్యంలో పోలింగ్ విధులు నిర్వహించడానికి కేటాయించిన సిబ్బందికి బుధవారం ఎన్నికల సామాగ్రి పంపిణీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. పోలింగ్ స్టేషన్ల వారీగా ఎన్నికల సామగ్రి పంపిణీకి కౌంటర్లు, ఏర్పాటు చేయాలని పోలింగ్ సిబ్బందికి ఏలాంటి ఇబ్బందులు కలగకుండా సామగ్రిని పంపిణీ చేయాలని సూచించారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో తాగునీటి వసతి, భోజన వసతి కల్పించాలని అన్నారు. ఎన్నికల సిబ్బంది సామగ్రితో వారికి కేటాయించిన పోలింగ్ స్టేషన్‌కు వాహనాల్లో వెళ్లే విధంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవో రాధాబాయి, రాజేశ్వర్, తహసీల్దార్ ఉమారాణి, మహేష్, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యలు ఉన్నారు.



డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

● పోలీస్ శాఖ పటిష్టమైన చర్యలు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ పటిష్టమైన చర్యలు తీసుకుందని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. మంగళవారం సిరిసిల్ల, తంగళ్లపల్లి, చందుర్తి పోలీస్ స్టేషన్ల పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి పోలింగ్ కేంద్రాల వద్ద తీసుకోవలసిన భద్రత చర్యల మీద అధికారులకు పలు సూచనలుచేశారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈనెల 27న జరిగే ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికల సందర్భంగా 200 మంది పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 41పోలింగ్ కేంద్రాలో 23347 మంది ఓటర్లు తమ ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో వినియోగించుకునేల ఏర్పాట్లు చేశామన్నారు. పోలింగ్ ప్రక్రియ మొదలు నుంచి పూర్తి అయ్యేవరకు పోలింగ్ కేంద్రాల వద్ద అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల పట్టణ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, రూరల్ సీఐ మొగిలి, చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

సిరిసిల్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల పెండింగ్ బిల్లులు, 317 బాధితులు, కారుణ్య నియామకాలు, పీఆర్‌సీ పెండింగ్ డీఏలు పూర్తి చేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేసినట్లు టీఎన్‌జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ కోరారు. మంగళవారం సిరిసిల్ల టీఎన్‌జీవో భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాజన్న సిరిసిల్ల జిల్లా టీఎన్‌జీవోఎస్ అధ్యక్షుడు ఎలుసాని ప్రవీణ్, కార్యదర్శి గాజుల సుదర్శన్, టీజీవోఎస్ జిల్లా అధ్యక్షుడు సమర్సేన్, ట్రెసా జిల్లా అధ్యక్షుడు జయంత్‌కుమార్, పోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ అధ్యక్షుడు కుమారస్వామి, కార్యదర్శి జీవన్, ఎం శ్రీకాంత్, అనిల్, జగిత్యాల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్, హుస్సేన్, రాజేష్, నరేందర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

శివోహం..

(3వ పేజీ తరువాయి)

ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉపవాస దీక్షలో ఉండే భక్తులు శివాలయాలను సందర్శించి స్వామివారికి పూజలు చేయనున్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి సందర్భంగా తెల్లవారుజామున 4 గంటల నుంచి నిత్య పూజ కార్యక్రమాలతో పాటు ఉదయం 5 గంటలకు శ్రీ విఘ్నేశ్వర పూజ, ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిరంతర జలాభిషేకం, సాయంత్రం 6 గంటలకు అఖండ దీపారాధన, రాత్రి 12 గంటలకు లింగోద్భవం, రుద్రాభిషేకం, బిల్వార్చన పూజలు నిర్వహించనున్నారు. గురువారం శివపార్వతుల కల్యాణ మహోత్సవం నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. జిల్లా కేంద్రంలో శివాలయం, శ్రీ విశ్వనాథ స్వామి దేవస్థానంతోపాటు ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, ఇల్లంతకుంట, తంగళ్లపల్లి ముస్తాబాద్, వీర్నపల్లి, కోనరావుపేట, చందుర్తి, రుద్రంగి, బోయినపల్లి మండలాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు, వేడుకలకు ఏర్పాట్లు చేశారు.

బీఆర్ఎస్ పాలనలో రిటైర్‌మెంట్లు..

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : బీఆర్‌ఎస్ పాలనలో రిటైర్‌మెంట్లు తప్ప రిక్రూట్‌మెంట్స్ లేవని విద్యార్థులు, నిరుద్యోగులు గమనించారని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మహేందరెడ్డి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 14 నెలల పాలనలో ఉద్యోగులకు, నిరుద్యోగులకు ఏం చేశారో తమ అభ్యర్థి నరేందర్‌రెడ్డికే ఎందుకు ఓటు వేయాలో ప్రచారంలో వివరించామన్నారు. గ్రంథాలయం జిల్లా చైర్మన్ నాగుల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ వెల్ముల స్వరూపతిరుపతిరెడ్డి, డైరెక్టర్ బి వెంకటేశం, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, మాజీ కౌన్సిలర్ రాగుల జగన్, అర్బన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ నేరెళ్ళ శ్రీకాంత్‌గౌడ్, అమర్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

అర్చకుడిని నెట్టివేసిన పోలీసులు..

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో విధులు నిర్వర్తించే రాజు అనే అర్చకున్ని పోలీసులు నెట్టివేశారు. విధుల్లో భాగంగా ఆలయంలోకి వెళ్లే క్రమంలో డ్యూటీలో ఉన్న పోలీసు సిబ్బంది అడ్డుకున్నారు. తాను అర్చకుడినని పోలీసు సిబ్బందికి తెలిపినా నెట్టివేయడంతో విధులకుహాజరుకాకుండా తిరిగివెళ్లినట్లు తెలిసింది.

కలెక్టర్‌పై సీఎస్‌కు ఫిర్యాదు

సిరిసిల్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్‌కు మార్ ఝా తీరుపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి మంగళవారం బీఆర్‌ఎస్ పక్ష నేత ఎమ్మెల్సీ మధుసూధనాచారి, ఎమ్మెల్యేలు వివేకానంద, డాక్టర్ సంజయ్‌లు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. సచివాలయం వద్ద వారు కలెక్టర్ తీరుపై మాట్లాడారు కలెక్టర్ చర్యలు నియంత్రించాలని లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని ప్రకటించారు. సిరిసిల్లలో కేటీఆర్‌పై అభిమానంతో టీ షాప్ నిర్వహిస్తున్న వ్యక్తికి ట్రేడ్ లైసెన్స్‌లేదని ఇబ్బందులకు గురిచేస్తున్నారని, సిరిసిల్ల కలెక్టర్ అధికార దర్పంతో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికార దుర్వినియోగం చేసి ప్రజలను భయపెడుతున్నారని నోటీసులు ఇవ్వకుండా షాపును క్లోజ్ చేయడం సరికాదన్నారు. బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా ఉన్నవారిని అనవసరంగా ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతూ అధికారులు పనిచేస్తున్నారని అన్నారు.

కాంగ్రెస్, బీజేపీలను నమ్మవద్దు : బీఎస్పీ

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ, బీజేపీ పార్టీలు బహుజనుల వ్యతిరేక పార్టీలు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు తీరని ద్రోహం చేసిన పార్టీలను నమ్మవద్దని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ అన్నారు. మంగళవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో పట్టాభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు మద్దతుగా బీఎస్పీ ఆధ్వర్యంలో కరపత్రాన్ని నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంద ప్రభాకర్ మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి 76సంవత్సరాలైన బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీలు ఇంకా అడుకునే బతుకులైనాయన్నారు. రాజ్యాధికారం లేకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని ఈదేశ సంపదను ఎవరైతే సృష్టించారో వారికి రాజ్యాధికారం రావడం కోసం పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటివరకు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను నమ్మినం ఓట్లు వేస్తూ వచ్చాం ఎన్నికల సమయంలో వాడుకొని వంచించాయని ఆరోపించారు. బీసీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణను గెలిపించాలన్నారు. ఈ సమావేశంలో బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎనగందుల వెంకన్న, జిల్లా అధ్యక్షుడు వరదవెల్లి స్వామి, ప్రధాన కార్యదర్శి బొడ్డు మహేందర్, ఉపాధ్యక్షుడు గూగులోత్ చంద్రనాయక్, కోశాధికారి అబ్దుల్లాది, పట్టణ అధ్యక్షుడు అరకాల రమేష్, ఉపాధ్యక్షులు నరేందర్, కుంట శ్రీనివాస్, వెంగల అంజనేయులు, బాలరాజు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

క్రీడల్లోనూ రాణించాలి

కోనరావుపేట ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఇంటర్మీడియట్ డీఐఈవో శ్రీనివాస్ అన్నారు. కోనరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్రీడా, సాంస్కృతిక దినోత్సవ కార్యక్రమాలను మంగళవారం నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కేదారేశ్వర్, జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు శరత్ అధ్యాపక బృందం పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి ఆర్థిక సాయం

ముస్తాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోతుగల్‌లో ఆత్మహత్యకు పాల్పడిన రైతు కుటుంబానికి తక్షణ సహాయం కింద రూ. లక్ష అందించామని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పేర్కొన్నారు. మంగళవారం అప్పుల బాధతో పురుగుల మందు తాగి మరణించిన జెల్ల దేవయ్య కుటుంబానికి ప్రభుత్వం తరుపున లక్ష రుపాయల విలువ చేసే చెక్కును స్థానిక అధికారుల చేతులమీదుగా దేవయ్య భార్య పద్మకు అందించారు.

కాగా, మండలంలోని పోతుగల్‌లో అప్పు బాధతో మరణించిన జెల్ల దేవయ్య కుటుంబాన్ని మంగళవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కెకె మహేందర్ రెడ్డి పరామర్శించారు.

బాధితులకు పరామర్శ

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో అనారోగ్యంతో బాధ పడుతూ చికిత్స పొందుతున్న ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు గంభీరావుపేటకు చెందిన పాలోజీ శ్రీనివాస్, అక్తరీబేగంలను నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యలు మంగళవారం పరామర్శించారు. నాయకులు రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.

సన్మానం

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండల ముదిరాజ్ సంఘ అధ్యక్షుడుగా ఎన్నికైన ఎల్లవేణి రమేష్‌ను పెద్ద లింగాపురం గ్రామస్థులు మంగళవారం వేర్వేరుగా ఘనంగా సత్కరించారు. మాజీ సర్పంచ్ జితేందర్‌గౌడ్, యువజన నాయకుడు కేతిరెడ్డి నవీన్‌రెడ్డి పాల్గొన్నారు

సాగు నీరందించడంలో విఫలం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీరు అందించడంలో విఫలమైందని తాజా, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్ రావు ఆరోపించారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.రైతులు సాగు చేసిన పంట పొలాలు ఎండిపోతున్నా. సాగు నీరు అందించడంలో విఫలమైందని ధ్వజమెత్తారు. సమావేశంలో నాయకులు సుభాష్, జబ్బార్, తిరుపతినాయక్, రాము, పర్శరాములు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య

కోనరావుపేట ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన ఓ డిగ్రీ విద్యార్థి పొట్ల రాకేష్(20) హైదరాబాదులో ఆత్మహత్య చేసుకున్నాడు. ఆరు రోజుల క్రితం ధర్మారంలో ఉంటున్న తల్లిదండ్రులు బాలమల్లు, మంజులకు ఫోన్‌చేసి తనకు చదువు మీద ఇష్టం లేదని చెప్పాడు. ఇష్టం లేకపోతే బాధపడవద్దని, ఇంటికి రమ్మని తల్లిదండ్రులు చెప్పారు. సోమవారం అర్ధరాత్రి కాచిగూడలోని రైల్వేస్టేషన్ సమీపంలో ట్రైన్ కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా తన చావుకు ఎవరూ కారణం కాదని, చదువు మీద ఇంట్రెస్ట్ లేదని, అమ్మానాన్న బాధపడవద్దని సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు. కోనరావుపేట ఎస్సై ప్రశాంత్‌రెడ్డికి కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ధర్మారం గ్రామానికి తీసుకవచ్చారు.

కళాశాలల్లో ఫేర్‌వెల్, వార్షికోత్సవాల సందడి



సిరిసిల్లలో జూనియర్ కళాశాల విద్యార్థులు నృత్యాలు



రాచర్లబొప్పాపూర్‌లో..



చందుర్తిలో..

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మంగళవారం ఫెషర్స్ డేను నిర్వహించారు. విద్యార్థులు సంస్కృతి కార్యక్రమాలు ఆకుట్టుకున్నాయి. సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా ఇంటర్మీడియోట్ అధికారి శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ విజయ రఘునందన్, శరత్, దేవరాజం, శంకర్‌నారాయణ, అధ్యాపకులు శ్రీధర్, శ్రీనివాసరావు, బుర్ర వెంకటేశం, సామల వివేకానంద, కనకయ్య, చంద్రమౌళి, అరుంధతి, చంద్రశేఖర్, అంజనేయులు, విజయ, శ్రీనివాస్, సురేష్, రాజయ్య, శశిధర్, రాజశేఖర్, సుజిత పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు రాచర్లబొప్పాపూర్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ జూనియర్, డిగ్రీ, ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో మంగళవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు వేడుకలు ఘనంగా జరిగాయి. రాచర్లబొప్పాపూర్‌లోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాల వేడుకలకు హాజరై డీఐఈవో శ్రీనివాస్ మాట్లాడారు. విద్యార్థుల నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్లు ప్రభాకర్, శైలజ, చైర్మన్ వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు రాజయ్య, జయశ్రీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

● చందుర్తి,ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళాశాల ఘనంగా కళాశాల వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. గత సంవత్సరం ప్రతిభ సాధించిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ కే. దేవరాజం బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అధ్యాపక బృందం, విద్యార్థుల ఉత్సాహంగా పాల్గొన్నారు.

● రుద్రంగి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : రుద్రంగి మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో ఫేర్వెల్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు పలువురుని అలరించాయి. గత సంవత్సరం పదో తరగతిలో అత్యధిక జీపీఏ సాధించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కరస్పాండెంట్ ఎలిగేటి నరేష్, డైరెక్టర్లు తిపిరెడ్డి వెంకట రెడ్డి, ఎర్రం గంగా నర్సయ్య, పడాల సురేష్, ప్రిన్సిపాల్ హరినాథ్ రాజులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు



రుద్రంగిలో నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

రంజాన్ పండుగకు ముమ్మర ఏర్పాట్లు

- మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ఎంఏ భారతి

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) :రంజాన్ పండుగ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లు చేయాలని మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ఎంఏ భారతి కోరారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం ముస్లిం నాయకులతో పీఎస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మైనార్టీ అధికారి ఎంఏ భారతి మాట్లాడుతూ రంజాన్ మాసంను పురస్కరించు కుని సంబంధిత జిల్లా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లును చేయాలన్నారు. మజీద్‌ల తోపాటు ఈద్గాలను శుభ్రం చేసి, విద్యుత్ దీపాలను వెలిగించాలని కోరారు. మజీ ద్‌లు, ఈద్గాల వద్ద తాగునీటితో పాటు వేసవి సందర్భంగా నీడల కోసం టెంట్‌ల ను వేయించాలని సూచించారు. ఈ ఏర్పాట్లను జిల్లా పంచాయతీ అధికారులతో పాటు మున్సిపల్ అధికారులు నిత్యం పర్యవేక్షించాలని కోరారు. పోలీస్‌శాఖ ఆధ్వ ర్యంలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలన్నారు. సమావేశంలో సిరిసిల్ల ఇన్ చార్జి ఆర్డీవో రాధాబాయ్, జిల్లా పంచాయతీ అధికారి శేషాద్రి, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేష్, జిల్లా పౌర సరఫరాల అధికారి వసంత లక్ష్మీ, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ మురళీకృష్ణ, సెస్ ప్రతినిధి అరవింద్‌చారీ, సిరిసిల్ల తహసీల్దార్ ఉమరాణి, సిరిసిల్ల జామా మజీద్ కమిటి అధ్యక్షుడు సమీ, నాయకులు ఎండీ సలీం, ఎండీ సత్తార్, మైనార్టీ, మజీద్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీపీఐ మద్దతు..

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి సీపీఐ సంపూర్ణ మద్దతునిస్తుందని జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. మంగళవారం సిరిసిల్ల కార్మిక భవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అండదండలతో విద్యారంగంలో వస్తున్న సమస్యలను నరేందర్‌రెడ్డి పరిష్కరించగలడని మొదటి ప్రాధన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. సీపీఐ సిరిసిల్ల పట్టణ కార్యదర్శి పంతం రవి, జిల్లా నాయకులు నల్ల చంద్రమౌళి, అజ్జ వేణు, సోమ నాగరాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డికి మద్దతుగా వంతడుపులలో, కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మద్దతుగా మంగళవారం పొత్తూరు గ్రామంలో పట్టబద్రులను ఓట్లు అభ్యర్థించారు. బీజేపీ నాయకులు చిమ్మనగొట్టు శ్రీనివాస్, పీనకాసి అనీల్, కాంగ్రెస్ నాయకులు నర్సయ్య, భూంపల్లి రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : మండల కేంద్రంతో పాటు రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్, పదిర, హరిదాస్‌నగర్, వెంకటాపూర్,నారాయణపూర్, బండలింగంపల్లి, తిమ్మాపూర్, తదితర గ్రామాల్లో కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా మంగళవారం ప్రచారం నిర్వహించారు. మండలకేంద్రంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డిల వద్దకు బీజేపీ నాయకులు ఓటువేయాలని కోరారు.

● కోనరావుపేట : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో బీజేపీ నాయకులు పట్టభద్రల ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డిని గెలిపించాలని పట్టభద్రులను కోరారు ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గోపాడి సురేందర్ రావు, జవాజి తిరుపతి గౌడ్, మేకల ప్రదీప్, గంగయ్య రాములు వంశీ పాల్గొన్నారు.

● కోనరావుపేట : కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పచ్చకాల ఎల్లయ్య ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. పట్టభద్రులను కలిసి ఓటు అభ్యర్థించారు. నీరటి సురేష్ కర్ణాకర్, వంగాల శ్రీనివాస్ ఉన్నారు.

● ముస్తాబాద్ : ఎమ్మెల్సీగా నరేందర్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ కెకె మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని నవజ్యోతి ఇంగ్లీష్ మీడియం, మహర్షి ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో ప్రచారాన్ని నిర్వహించారు. మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, మాజీ ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, అరుట్ల మహేశ్‌రెడ్డి, నరేశ్, భాను, శీల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

● చందుర్తి : బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్ మండల కేంద్రంతోపాటు,తిమ్మాపూర్, మల్యాల గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో నాయకులు లోకోజి సతీష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.